

'ఖేలో ఇండియా'లో లలితకు రజతం



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఢిల్లీలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన కిల్లక లలిత రజత పతకం సాధించింది. 400 మీటర్ల పరుగు పందెంలో ఆమె పతకాన్ని కైవశం చేసుకుంది. లలితకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.కోటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష పి.ఎస్, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలలకు చరమగీతం

ప్రాథమికోన్నత పాఠశాలలకు చరమగీతం పాడేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోందా? పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే చర్యలకు పాల్పడుతోందా? పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందా? విద్యాశాఖలో జరుగుతున్న పరిణామాలు, పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల్లో ఆ శాఖాధికారుల వ్యాఖ్యలు చూస్తుంటే.. అవుననే సమాధానమే వస్తోంది. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117ను టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా, విద్యా సంస్కరణలకు సంబంధించి ఇంచుమించు అవే విధానాలనే కొనసాగిస్తోంది. పర్యావసానంగా ఆ విధానాలకు బలయ్యేది మాత్రం పేద విద్యార్థులే!.



- ఆరు స్కూళ్ల మూసివేతకు యత్నం
- ఇప్పటికే సబ్జెక్టు టీచర్ల తొలగింపు
- చదువుకు దూరం కానున్న 279 మంది విద్యార్థులు!

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మండలంలో ఎనిమిది ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలకు చరమగీతం పాడేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుంది. ఆరు పాఠశాలల్లో ఉన్న 6, 7, 8 తరగతులను సమీపంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. బొబ్బిలి మండలంలోని కారాడ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు 52 మంది ఉన్నారు. వీరిని అలజంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు తరలించేందుకు మ్యాపింగ్ చేశారు. రంగరాయపురం పాఠశాలలో 55 మంది విద్యార్థులుంటే, అందులో బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని అప్పయ్యపేట పాఠశాలకు 53మంది, పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఇద్దరిని తరలించేందుకు చూస్తున్నారు. ఎం.బూర్జవలస ప్రాథమికోన్నత పాఠశాలలో 28 మంది విద్యార్థులను పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు, కృష్ణాపురంలో 25 మంది విద్యార్థులను గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలకు, దిబ్బగుడ్డివలసలో 48 మంది విద్యార్థులను బొబ్బిలి పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలకు తరలించేందుకు మ్యాపింగ్ చేశారు. నారాయణప్పవలస పాఠశాలలో 21 మంది విద్యార్థులను సమీపంలోని మెట్టవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు తరలించనున్నారు.

279 మంది విద్యార్థులపై ప్రభావం

మండలంలో ఐదు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులను సమీపంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ నిర్ణయంతో 279 మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. పేద విద్యార్థులకు విద్య అందించేందుకు యథావిధిగా పాఠశాలలను కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

యుపి పాఠశాల కోసం పోరాటం



దళిత కాలనీలో ఉన్న విద్యార్థులంతా యుపి పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల మూతతో విద్యార్థులు చదువుకు దూరమవుతారు. ప్రాథమికోన్నత పాఠశాలను సాధించుకునేందుకు పోరాటం చేస్తాం.

- గొల్లపల్లి పాప, ఎస్ఎంసి వైస్ చైర్‌పర్సన్, రంగరాయపురం

పేద విద్యార్థులకు నష్టం



రంగరాయపురంలో ప్రాథమికోన్నత పాఠశాల మూతతో పేద విద్యార్థులకు నష్టం. రంగరాయపురంలోనే యుపి పాఠశాల తరగతులు నిర్వహించాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి.

- మర్రాపు కృష్ణ, ఎస్ఎంసి చైర్మన్, రంగరాయపురం

ప్రణాళిక ప్రకారమే సబ్జెక్టు టీచర్లు తొలగింపు

గత వైసిపి ప్రభుత్వ హయాంలో జిఒ 117 అమల్లో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను తొలగించింది. మూడేళ్ల నుంచి యుపి పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేనప్పటికీ ఆర్థిక స్తోమత లేకపోవడంతో పేద విద్యార్థులు అక్కడే చదువులను కొనసాగించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిఒ 117ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా, సబ్జెక్టు టీచర్లను నియమించలేదు. కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగిస్తోంది. అందులో భాగంగానే ప్లాన్ ప్రకారమే సబ్జెక్టు టీచర్లను తొలగించారని నిరూపితమవుతోంది.

పేదరికంతో చదువు దూరం



రంగరాయపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతులను రద్దు చేసి, అప్పయ్యపేట, పెంట పాఠశాలల్లో విలీనం చేశారు. నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుని చదివిస్తున్నారు. యుపి పాఠశాల మూతతో సైకిల్‌పై అప్పయ్యపేట, పెంట వెళ్లే పరిస్థితి లేదు. పేదరికం కారణంగా ప్రయివేట్ పాఠశాలలో చదివే స్తోమత లేదు. పేదరికం వల్ల నేను చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. యుపి పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి.

- గొల్లపల్లి ఉమామహేష్, ఆరో తరగతి విద్యార్థి

ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి కుట్ర



ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. బొబ్బిలి మండలంలో ఆరు పాఠశాలలను మూసి వేసేందుకు ప్రతిపాదనలు చేయడం దుర్మార్గం. యుపి పాఠశాలల సాధనకు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తాం.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో

ప్రజా సమస్యలపై పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-బొబ్బిలి

భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని లోకబంధు రెసిడెన్సీలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శమన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు దేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమికొడితే, నేటి పాలకులు కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన చేసి ప్రజా సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, వారి స్ఫూర్తితో దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, పి.శంకరరావు, టివి రమణ, జిల్లా నాయకులు జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంకులో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని శ్రీశ్రీ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్రీనివాసరావు ప్రారంభించారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై పన్నులు విధిస్తూ, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు అప్పులు మాఫీ చేస్తోందని చెప్పారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు ఇటువంటి సమాజాన్ని కోరుకోలేదని తెలిపారు. వారికి నిజమైన నివాళి అర్పించడం అంటే ఖాళీ ఉద్యోగాల భర్తీ, విద్య, వైద్యం కోసం, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమేనని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తదానం చేయడం చాలా అవసరమని తెలిపారు. రక్తం అందక అనేక మంది మరణిస్తున్నారని, అందుకే రక్తదానానికి యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పార్ధు, వాసు, ఆదిత్య, మేఘన, వెన్నెల, సాయి రాజశేఖర్, యువకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, యువకుడు

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలకు

ఎమ్మెల్యే రాంరాం!

- హాజరుకాని అదితి గజపతిరాజు
- నగర వాసుల్లో చర్చ
- తెలుగు తమ్ముళ్లలో ఆందోళన



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఎమ్మెల్యేగా అదితి గజపతిరాజు గెలిచి సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నా ఒక్క కౌన్సిల్ సమావేశానికీ హాజరుకాలేదు. కౌన్సిల్ సమావేశాలకు ఎమ్మెల్యే గైర్హాజరుపై నగరంలో సర్వత్రా చర్చ సాగుతోంది. విజయనగరం నియోజకవర్గంలో 80 శాతం జనాభా నగరంలోనే ఉన్నారు. అటువంటి విజయనగరం కార్పొరేషన్‌లో వైసిపి పాలకవర్గం అధికారంలో ఉంది. ఎమ్మెల్యేగా టిడిపి నుంచి అదితి గజపతిరాజు విజయం సాధించారు. నగర అభివృద్ధి, ప్రజలకు కార్పొరేషన్ అందిస్తున్న సేవలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు ఉంది. నగరపాలక సంస్థలో పాలకవర్గం వైసిపిదే అయినా, తీసుకునే నిర్ణయాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకోవడం ఒకటైతే, సమావేశాలకు రావడం, చర్చించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సూచనలు, సలహాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. అటువంటి వేదికను ఉపయోగించుకోక పోవడంతో టిడిపి శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికే వేసవి ప్రారంభమైంది. ఏటా వేసవిలో ప్రధానంగా నగర వాసులు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. అధికారులు తీసుకున్న చర్యలు ఎలాగూ ఎమ్మెల్యేకు నివేదిస్తారు. కానీ సమావేశాలకు హాజరు కావడం, చర్చించడం ద్వారా ప్రజల్లోకి ఎమ్మెల్యే వెళ్లే అవకాశం ఉంటుంది. అటువంటి సమావేశాలకు రాకపోవడం వల్ల ఎమ్మెల్యే స్థానికంగా ఉన్నారా? అనే సందేహం నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు.

నగర పాలకులు కోట్లాది రూపాయలను వివిధ అభివృద్ధి పనుల పేరుతో కేటాయింపులు చేస్తున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉన్నా విజయనగరం నగరపాలక సంస్థలో తెలుగు తమ్ముళ్ల నిర్ణయాలు చెల్లుబాటుకు అవకాశం లేదు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు అసహనంతో ఉన్నారు. మరోవైపు ఏడాది కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇదే నగరపాలక సంస్థలో ఎమ్మెల్యే జోక్యం లేకుంటే స్థానిక ఎన్నికల్లో అధికారంలోకి రావడం కష్టమనే అభిప్రాయాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్ల కాలంలో అన్ని తానై వ్యవహరించిన తీరు తెలిసిందే. నగర పాలక సంస్థలో ఏ నిర్ణయం చేయాలన్నా ఆయన చెప్పిందే వేదం, చేసిందే చట్టం మాదిరిగా వ్యవహరించారు. నేడు తొమ్మిది నెలలు కావస్తున్నా ఎమ్మెల్యే నగర పాలక సంస్థ పరిపాలనలో జోక్యం చేసుకోకపోవడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది. ఏడాది కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఎమ్మెల్యే అదితి దూకుడు పెంచుతారో, లేక ఇదే పంథాను కొనసాగిస్తారో చూడాల్సి ఉంది.

ఏడుగురికి ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండగ సందర్భంగా పోలీసు మెడల్స్‌ను ప్రకటించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తూ, ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది పండగ సందర్భంగా పోలీసు సేవా మెడల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

పోలీసుశాఖ పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నుంచి ఎస్‌బి ఎస్‌ఐ వై.సత్యనారాయణ ఉత్తమ సేవ, ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఎఎస్‌ఐ ఎం.ప్రసాదరావు, గుర్ల హెచ్‌సి పి.రమణ, కానిస్టేబుల్ కె.గోపాలరావు, ఎఆర్ ఎస్‌ఐ కె.అప్పలరాజు, ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.గోవిందం, ఎఆర్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు సేవా పతకాలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవ, సేవా పతకాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పని చేసి, జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఎస్‌పి వకుల్ జిందల్ ఆకాంక్షించారు.

ఉల్లాసంగా అక్షరాస్యత పరీక్ష

46,953 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం

వయోజనులను అక్షరాస్యులను చేసే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన అక్షరాస్యతా పరీక్ష విజయవంతంగా పూర్తయింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 46,953 మంది వయోజనులు హాజరై ఉత్సాహంగా పరీక్ష రాశారు. ఉల్లాస్ కార్యక్రమంలో 48,578 మంది రిజిస్టర్ కాగా, పరీక్షకు 46,953 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 1625 మంది పరీక్షను రాయలేకపోయారు. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ జామి మండలంలో పర్యటించి, పరీక్షను తనిఖీ చేశారు. వయోజన విద్యాశాఖ డిడి ఎ.సోమేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ్ చక్రవర్తి, మండల స్థాయిలో ఎంపిడిఒలు విస్తృతంగా పర్యటించి పరీక్షను పర్యవేక్షించారు.



త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

ఘనంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారతీయ విద్యా కేంద్ర నిర్వహణలోని నృత్య కళాభారతి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరువీధి ఉత్సవాన్ని నగరంలోని నృత్య కళాభారతి నుంచి గుమ్చి శంకరమఠం, కోట మీదుగా బివికె పాఠశాల వరకు నిర్వహించారు. అనంతరం బివికె పాఠశాలలో త్యాగరాజ స్వామి పూజా కార్యక్రమం, పంచరత్న సేవ చేపట్టారు. త్యాగరాజ కీర్తనలను కళాకారులు ఆలపించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యక్షులు కెవివిఎల్ఎన్ శాస్త్రి, కళాకారులు ఎం.నీలాద్రిరావు, రామ్‌చరణ్ పద్మావతి, రామచంద్ర శేఖర్, పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్‌కు విజయసాయిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రెండో కుమారుడు ప్రణీత్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం విజయనగరంలోని జెడ్‌పి చైర్మన్ ఇంటికి మాజీ ఎమ్‌పి విజయసాయిరెడ్డి వచ్చి, ఆయన్ను పరామర్శించారు. ప్రణీత్‌కు నివాళులర్పించారు.



జెడ్‌పి చైర్మన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్‌పి విజయసాయిరెడ్డి

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- చేతిబోర్లన్నీ కండీషన్‌లోనే ఉన్నాయి
- మిగిలిన పథకాల్లోనూ పుష్కలంగా నీరు
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్లే లక్ష్యంగా జెజెఎం
- ఐదు జలాశయాలకు అనుసంధానంగా సిపిడబ్ల్యు స్కీమ్స్
- 'ప్రజాశక్తి'తో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత ముఖాముఖి

వేసవి నేపథ్యంలో జిల్లాలో నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యుఎస్) ఎస్ఇ ఎస్.కవిత అన్నారు. ప్రస్తుతం చేతిబోర్లన్నీ కండీషన్‌లోనే ఉన్నాయని, సింగిల్ విలేజ్, మల్టీ విలేజ్ స్కీముల్లో కూడా నీరు పుష్కలంగానే ఉందని వివరించారు. ఇంటింటికీ కుళాయి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మల్టీ విలేజ్ స్కీమ్‌లను జిల్లాలో ఐదు జలాశయాలకు అనుసంధానం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



జిల్లాలో తాగునీటి సరఫరా, వనరుల పరిస్థితి ఎలా ఉంది.?

ప్రస్తుతం జిల్లాలో తాగునీటి ఇబ్బందులంటూ లేవు. భూగర్భ జలాలు అందుబాటులోనే ఉన్నాయి. సాంకేతిక ఇబ్బందులు కూడా ఎక్కడా లేవు. ఎక్కడైనా నీటి కొరత గానీ, సాంకేతిక సమస్యలు గానీ ఉంటే, వాటిని వెంటనే మండల, నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిపై నేను అప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, ఇబ్బంది లేకుండా చూస్తున్నాను.

వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు ప్రణాళిక ఏంటి.?

మన జిల్లాలో సుమారు 15 వేల చేతి బోర్లు, సింగిల్ విలేజ్ స్కీమ్స్ సుమారు 1500, మల్టీ విలేజ్ స్కీమ్స్ 30 వరకు ఉన్నాయి. మల్టీ విలేజ్ స్కీమ్స్ నుంచి 891 గ్రామాలకు తాగునీరు అందుతోంది. వేసవి నేపథ్యంలో ఇప్పటికే చేతి బోర్లు, పంప్‌సెట్లు, పైపులైన్లు ఇప్పటికీ ఒకటికి రెండు సార్లు సరిచేస్తున్నాం. దాదాపు అన్ని చోట్ల బాగానే ఉన్నాయి. వేసవి నేపథ్యంలో ఎక్కడ సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను నియమించాం. కేవలం మరమ్మతులే కాకుండా అవసరమైన సామగ్రి కూడా అందుబాటులో ఉంచుకున్నాం.

నిధులు అందుబాటులో ఉన్నాయా.?

చేతిబోర్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన సామగ్రి నిరంతరం సిద్ధంగా ఉంటుంది. సింగిల్ విలేజ్ స్కీముల నిర్వహణ బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీలదే. వారికి మా శాఖ తరపున టెక్నికల్ సపోర్టు పూర్తిస్థాయిలో ఉంటుంది. ఫిర్యాదు, లేదా సమాచారం అందిన వెంటనే సిబ్బంది గ్రామాన్ని సందర్శించి పరిష్కరిస్తున్నారు. మల్టీ విలేజ్ స్కీముల నిర్వహణకు కూడా నిధుల విషయంలో ఢోకా లేదు.

జల జీవన్ మిషన్ అమలు ఎంత వరకు వచ్చింది.?



ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ కల్పించడమే జల జీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం అవసరమైన బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులు మంజూరు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 4.15 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1.95 లక్షల ఇళ్లకు సమకూర్చాం. మిగిలిన ఇళ్లకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వాటర్ గ్రిడ్ ద్వారా కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

ఏయే జలాశయాలను సిపిడబ్ల్యుఎస్‌కు అనుసంధానం చేయనున్నారు.?

తోటపల్లి, తాటిపూడి, ఆండ్ర, మడ్డువలస, రామతీర్థసాగర్ నీటిని ప్రాంతాల వారిగావున్న సిపిడబ్ల్యు స్కీములకు అనుసంధానం చేయాలని భావిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ మేరకు ఉన్న అవకాశాలను గుర్తించి ఇప్పటికే నివేదిక అందజేశాం. ఇందుకోసం రూ.4,845 కోట్ల మేర ప్రారంభ వ్యయం అవసరం కానున్నట్టు కూడా నివేదికలో స్పష్టం చేశాం.


గ్రామంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలే పునాది

ప్రజాశక్తి - మెరకముడిదాం

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని సింగవరం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.ప్రశాంతి విద్యార్థుల తల్లి తండ్రులకు తెలిపారు. ఆదివారం ఆమె తమ ఉపాధ్యాయ సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు ఇంటింటికి వెళ్లి 'మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి, మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు మాది గారెంటీ' అంటూ తల్లి తండ్రులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, షూ నాణ్యమైన భోజనం అందుతుందని తెలిపారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు ప్రతి సంవత్సరం ప్రభుత్వం సహాయం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందరు శిక్షణ పొందిన వారు కావున మీ పిల్లలకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తారని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి అంటూ తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రాజకుమారి, జ్యోతి, అంగన్వాడి సిబ్బంది, ఎస్ఎంసి చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - తెర్లాం

చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం పిల్లలతో పుస్తకాలు కథలు పురానా ఇతిహాస పుస్తకాలను చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

డిఇగా భాస్కరరావు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఇరిగేషన్ సర్కిల్ ఉప పర్యవేక్షక ఇంజినీర్‌గా ఎం.భాస్కరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి ఇరిగేషన్ కార్యాలయంలో ఉప పర్యవేక్షక ఇంజినీర్ పోస్టు ఖాళీగా ఉండడంతో సాంకేతిక పరంగా అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే బేబినాయన స్పందించి ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి ఉప పర్యవేక్షక ఇంజినీర్ పోస్టును భర్తీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భాస్కరరావును ఎన్‌జిఒ సంఘం నాయకులు గొల్లపల్లి రామారావు, అక్కేన సతీష్ కుమార్, పొట్నూరు సునీత, మరిపి దీపిక, బొంగు శ్రీలత, వి.జయలక్ష్మి, బి.స్వరూప కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల విలీనాన్ని ఆపాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

జిఒ 117 రద్దు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను రక్షించాలని ఆంధ్రప్రదేశ్ జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సాయికిరణ్ యాదవ్ అన్నారు. స్థానిక పోల్‌బాగ్ జంక్షన్ వద్ద నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 117 తీసుకొచ్చి గ్రామాల్లో ఉండే యుపి పాఠశాలలను తరలించడం సమంజసం కాదన్నారు. స్థానిక ఎం. బూర్జివలస యూపి పాఠశాలలో 6,7,8, తరగతులకు గాను 20 మంది విద్యార్థులు ఉన్నారని ఆ గ్రామానికి దూరంగా ఉన్న పెంట హై స్కూల్‌కు ఈ స్కూల్‌ను మార్చడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్, మహేష్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప్ మెగా జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద విద్యాసంస్థలో ఆదివారం నిర్వహించిన సంకల్ప మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. ఈ మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం, నిరుద్యోగుల కోసం పలు కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు పూర్తి అయిన తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినా వ్యక్తులకు ఆఫర్ లెటర్లను అందించారు. అనంతరం గొంప కృష్ణ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 1450 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోగా వీటిలో 318 మంది సభ్యులు ఎంపికయ్యారని, 80 మంది సెలెక్షన్‌ను పొందారని, ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 18 కంపెనీలు హాజరై ఉద్యోగార్థులకు అవకాశాలు అందించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, గుమ్మడి వాణి భారతి, రెడ్డి పైడి బాబు, జుత్తాడ రామసత్యం, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ సీపీ ప్రసాద్, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ యువత పాల్గొన్నారు.

అధినేతపై అపార గౌరవం ఉంది

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జనసేన అధినేతపై తమకు అపారమైన గౌరవం ఉందని జనసేన నాయకులు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం ఉప సర్పంచ్ బాల అప్పలరాజు అన్నారు. శనివారం గుర్ల మండలంలో అతిసార బాధితులకు జనసేన అధినేత పంపించిన చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమానికి ప్రచారం నిమిత్తం ఫ్లెక్సీలు వేసామని, కొన్ని ఫ్లెక్సీల్లో పవన్ కళ్యాణ్ ఫోటో వేయడం ఫ్లెక్సీ సెంటర్ వాళ్ళు మరిచారని దాన్ని కొంతమంది అధినేత ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వేసారంటూ రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. అధినేత ఫోటో వేసిన ఫ్లెక్సీలు పక్కన పెట్టేసి ఫోటోలేనీ ఫ్లెక్సీలతో వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్నారన్నారు. తమ అధినేత పైన, తమ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పైన తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. ఓవర్ నైట్ సుమారుగా 250 ఫ్లెక్సీలు వేయడంతో వాటిలో కొన్నిటిలో లేకపోవడంతో ఈ రద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ ప్రచారాన్ని జనసైనికులు గమనించాలన్నారు.

నూకాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మంగళవీధిలో పాత పశువుల మార్కెట్ ఆవరణలో ఉన్న నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆదివారం నుంచి ఈ నెల 28వ వరకు జాతరను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ ఆలయంలో పూజలు చేశారు. జాతర సందర్భంగా ప్రతిరోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 28న అమ్మవారి చల్లదనం మహోత్సవం, ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్‌కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్‌బాబు, రాజేంద్రప్రసాద్, వెంపడాపు వెంకటరావు, పిన్నింటి సునీల్ , యడ్ల రాంబాబు, యడ్ల శ్రీనివాస్, తణుకు హేమసుందర్ పాల్గొన్నారు.

మూగ జీవాల స్నేహబంధం

- జాతి వైరం పక్కనపెట్టి

కుక్క పిల్లకు పాలు ఇచ్చిన మేక

ప్రజాశక్తి- రేగిడి

మూగజీవాల స్నేహ బంధం చూపరులకు కను విందుగా ఉంది. జాతి వైరం పక్కనపెట్టి ఆ మేక కుక్క పిల్లకు ప్రతిరోజు పాలు ఇస్తుంది. మేక తన పిల్లలకు పాలు ఉన్నా.. లేకపోయినా.. కుక్క పిల్లకు మాత్రం పాలు ఇచ్చి మాతృ ప్రేమతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ దృశ్యం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం ప్రజాశక్తి కంటపడింది. లక్ష్మింపురం గ్రామానికి చెందిన ముగడ రాము మేకల మందలో ఓ మేక మూడు నెలల నుంచి కుక్క పిల్లకు పాలు ఇస్తూ మూగజీవాల స్నేహబంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. మానవత్వం లోపించిన ఈ రోజుల్లో ఇలా మూగజీవాలు ఒకరినొకరు ఆప్యాయంగా కలిసి ఉండటాన్ని పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.


మేక వద్ద పాలు తాగుతున్న కుక్క

ప్రశాంతంగా ఉల్లాస్ పరీక్ష

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షను 42 కేంద్రాల్లో 1681 మంది నిరక్షరాస్యులు రాశారు. తెర్లాం, పెరుమాలి పరీక్ష కేంద్రాలను ఎంపిడిఒ ఆర్ రాంబాబు, ఎంఇఒ-2 పాపారావు, ఉపాధ్యాయులు జి.శాంత్ కుమార్, ఎపిఎం టి.రాము పరిశీలించారు. అంగన్వాడి టీచర్లు ఇన్విజిలేటర్లుగా, సీసీలు, విఒఎలు స్వచ్ఛంద వాలంటీర్లుగా పనిచేశారు.

రేగిడి: మండలంలో 42 పాఠశాలల్లో నిరక్షరాస్యుల ఉల్లాస్ పరీక్షలకు 1722 మంది హాజరైనట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి, రాజాం ఏరియా కోఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఆర్ ఎపిఎం బాసిన గోవిందరావు, మండల కోఆర్డినేటర్ సిహెచ్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంకిలి, రేగిడి, ఉమదాలవలస, బూరాడ, బల్లాయవలసపురం తదితర పాఠశాలలో జరుగుతున్న ఉల్లాస్ పరీక్షలను వారు పరిశీలించారు. మొత్తం 108 పరీక్ష గైర్హాజరైనట్లు తెలిపారు.

గంట్యాడ: మండలంలోని 34 గ్రామాల్లో 1830 మంది ఆదివారం ఉల్లాస్ పరీక్షను రాశారు. అంగన్వాడీ టీచర్లు వెలుగు సీసీలు, విఒఎలు పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని ఆదివారం ఉల్లాస్ పరీక్ష ఉల్లాసంగా జరిగిందని ఎపిఎం లోపింటి సత్యనారాయణ అన్నారు. గత రెండు నెలలుగా నిరక్షరాస్యులకు వాలంటీర్లు ఇచ్చిన శిక్షణ పై ఈ పరీక్ష 36 కేంద్రాలలో నిర్వహించామని 1812 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలను ఎంపిడిఒ, శ్రీనిధి మేనేజర్ అరుణ కుమారి పరిశీలించారు.


డెంకాడ: పేపర్లను పరిశీలిస్తున్న అధికారులు


గజపతినగరం: పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు

బొండపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఉల్లాస్ పరీక్షలు నిర్వహించారు. వెలుగు ఎపిఎం కె.పెంటంనాయుడు పర్యవేక్షణలో 1830 మందికి గాను 1803 మంది సభ్యులు పరీక్షలు రాశారు.

బొబ్బిలిరూరల్ : వయోజనులంతా విద్య వంతులు కావాలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. నిరక్షరాస్యత కలిగిన వయోజనులకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మండలంలో 1830 మందికి శిక్షణ ఇచ్చారు. వారికి ఆదివారం 36 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. వారిలో 1733 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లక్షణరావు, వెలుగు ఎపిఎం భాగ్యలక్ష్మి, విజయనగరం భాద్యులు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని 43 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉల్లాస్ అసెస్‌మెంట్ ఎగ్జామ్‌ను 1,830 మంది రాయాల్సి ఉండగా 1,815 మంది రాశారు. పరీక్ష నిర్వహణకు అంగన్వాడీ టీచర్లను ఇన్విజిలేటర్‌లు, పేపర్ వాల్యూయేషన్ బాధ్యతలకూ నియమించారు. గునుపూరుపేట, పెదతాడివాడ, గునుపూర్, డెంకాడ, లెంకపేట, ఆర్. ముంగనాపల్లి, కొల్లం, ఉడుకులపేట, అక్కివరం, పేడాడ తదితర కేంద్రాల్లో జరిగిన పరీక్షలను ఎపిఎం, అబ్జర్వర్ రాంబాబు పరిశీలించారు.

నెల్లిమర్ల: మండలంలో ఉల్లాస్ పరీక్ష కేంద్రాలను ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యులను చదవడం, రాయడం, లెక్కలు వేయడంలో తీర్చిదిద్దడానికి అక్షరాస్యత కార్యక్రమం చెపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, టీచర్ వెంకటేశ్వర రావు, ఐసిడిఎస్ జ్యోతి, పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలో ఉల్లాస్ పరీక్షకు 1755 మంది మహిళలు హాజరైనట్లు ఎపిఎం వై.ధనలక్ష్మి తెలిపారు. మహిళల అక్షరాశ్యత పెంపొందించటం, కుటుంబంలో వారికి కూడా అధిక ప్రాముఖ్యత లభించాలనే ఉద్దేశ్యంతో ఈ పరీక్ష నిర్వహించ నున్నట్లు ఆమె చెప్పారు.

సంతకవిటి: మండల పరిధిలో 50 కేంద్రాలలో 1830 మంది వయోజనులు ఆదివారం పరీక్ష రాయాల్సి ఉండగా 1790 మంది రాశారు. పరీక్షా కేంద్రలాను మండల మానిటరింగ్ ఆఫీసర్లు ఎంపిడిఒ సురేష్ కుమార్, ఎపిఎం డి.కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిసి సూపర్వైజర్ డి.మహేశ్వరరావు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షను పరిశీలించిన కలెక్టర్

జామి: వయోజనుల జీవన నైపుణ్యానికి దోహదపడే ఉల్లాస్ పరీక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ పరిశీలించారు. మండలంలోని అట్టాడ గ్రామంలోని పరీక్ష రాస్తున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల తీరును పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. మండలంలో 34 పరిక్షా కేంద్రల్లో 1831 మంది వయోజనులు ఉల్లాస్ పరీక్షల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ పరీక్షల ద్వారా వయోజనులను అక్షరాస్యులుగా గుర్తిస్తామని, అది వారి కుటుంబ జీవనైపుణ్యాన్ని మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, విద్యాశాఖ అధికారులు, అంగన్వాడీలు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.


జామి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

వృద్ధులే సమాజానికి మార్గదర్శకులు

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి - జామి

నేటి తరం యువతకు వృద్ధుల అనుభవాలు ఎంతో ముఖ్యమని వారి అనుభవాలతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని అట్టాడ బిఎన్ఆర్ ఆశ్రమం 6వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడచిన ఐదు సంవత్సరాలుగా ఆశ్రమంలో నిర్విరామంగా వృద్ధులకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులను ఆదుకోవాలనే తపనతో ఆశ్రమ నిర్వాహకులు భీశెట్టి శారద, డాక్టర్ బాల భార్గవి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. సమాజంలో ఎవరు వృద్ధులను గౌరవిస్తారో వారికే మంచి అవకాశాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ప్రతి అంశంలో అండగా ఉంటుందని, అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వృద్ధుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ బిఎన్ఆర్ ఆశ్రమానికి ఉత్తరాంధ్రలో ప్రత్యేక గుర్తింపు ఉందని నిత్య అన్నదాన క్షేత్రంగా మంచి పేరుని నిర్వాహకులు తెచ్చుకున్నారని, జిల్లా పరిపాలన యంత్రాంగం నుండి ఎటువంటి సహాయం కావాలన్నా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకి కలెక్టర్ నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల జ్యోతి, భీశెట్టి శారద, డాక్టర్ బాలభార్గవి, దవడ కొండబాబు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు, అట్టాడ, కోరుకొండ పాలెం సర్పంచ్‌లు అమ్మన్నదొర, బోని కృష్ణ, భీశెట్టి ఆదిబాబు, ఆశా, శిరీష, లోకేశ్, రెండు గ్రామాల్లోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వృద్ధురాలికి నూతన వస్త్రాలను అందిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం మండలంలోని వేములపల్లి, రేవల్లపాలెం, కొట్టం గ్రామాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలలలో పెన్షన్ పెంపు, ఉచిత ఇసుక, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్, గ్రామాల్లో సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణాలు, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేస్తూ రాష్ట్రానికి జీవనాడైనా రాజధాని పోలవరం పనులు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగరేయ్యాలని నాయకులకు కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ సర్పంచ్ లగుడు ఎర్నాయుడు, ప్రధాన కార్యదర్శి జూత్తాడ రామసత్యం, క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనివాస రాజు, సర్పంచులు మహేష్, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

భగత్‌సింగ్ స్ఫూర్తిగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భగత్ సింగ్ స్ఫూర్తిగా కార్మికులు, కర్షకులు ఉద్యమించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం జరజాపుపేట అమర వీరుల స్థూపం వద్ద భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ బ్రిటిష్ దొరల పాలనకు వ్యతిరేకంగా చిన్న వయసులో ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని కార్మికులు, కర్షకులు ఉద్యమించాలన్నారు. భగత్ సింగ్ ఆనాడు తెల్ల దొరలు పాలన పారదోలితే ప్రస్తుతం పాలిస్తున్న పాలకులు కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెట్టి దోచుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.పద్మనాభం, జె. ప్రకాష్, ఎస్.సూర్యారావు, టి.గణపతి, బి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రామారావు

బొబ్బిలి: సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత విద్యార్థి యువజన సమాఖ్య ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన కాలేజ్ హాస్టల్‌లో సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ బి రవికుమార్, బొబ్బిలి డివిజన్ కార్యదర్శి బి శ్రావణ్ కుమార్, పాల్గొన్నారు.

మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో పాత కోటలో గల మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆదివారం సభ్యులంతా కలిసి భగత్ సింగ్ వర్ధంతి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామినాయుడు మాట్లాడుతూ విముక్తి కోసం ఉద్యమించిన మహా నేత భగత్ సింగ్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి గోవింద నాయుడు, జాయింట్ సెక్రటరీ రవీంద్ర మోహన్, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్ వి రమణమూర్తి పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ రాజ్ గురులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర పోరాటం కేవలం రాజకీయ పోరాటంతోనే కాకుండా లక్షలాది మంది విప్లవ కారుల ప్రాణత్యాగాలతో ముడిపడి ఉందన్నారు. ఎంతోమంది వీరుల నిస్సం కోశంగా, తునప్రాయంగా, భారతమాత కోసం ప్రాణాలర్పించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే వాసుదేవరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్, తెలుగు మేడం డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్‌సిసి ఆఫీసర్ డాక్టర్ జి ఈరన్న, చరిత్ర ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు, శివకుమార్, లక్ష్మణ్, రామకృష్ణ, పాల్గొన్నారు.

విజయనగరంటౌన్: నగరంలోని వైఎస్ఆర్‌నగర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని నిర్వహించారు. వారికి ఎస్‌వైఎస్, పిడిఎస్ఒ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎం.అప్పలరాజు, బిగిరి ప్రసాద్, సిహెచ్ దిలీప్, శిల దిలీప్, జి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాంలో ఆదివారం ఎల్ఎస్ నర్సింగ్ హోమ్, డయాగ్నోస్టిక్ ఆసుపత్రిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కె రమణమూర్తి, నాయకులు జనపరెడ్డి శ్రీను, కె. బంగారునాయుడు, జామి అప్పలనాయుడు, అప్పలనాయుడు మాస్టరు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

మండలంలోని కుంపల్లి గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షుడు నర్సిపల్లి వెంకటరమణతో పాటు సుమారు 200 కుటుంబాలు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు ప్రతిపాదించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం డెక్క లీల భర్త ఎర్నాయుడుకు నియామకం ఉత్తరాలు ఇచ్చినందుకు ఎమ్మెల్యే లలిత కుమారి దంపతులను ఆదివారం అభినందించారు. తాము మొదటి నుంచీ టిడిపిలోనే ఉన్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కుంపల్లి సర్పంచ్ నరిసిపల్లి వెంకట రమణ, నాయకులు పైలా కన్నం నాయుడు, లెక్కల గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాకు చెప్పకుండానే పథకాలు అమలు చేస్తారా?

- సర్వసభ్య సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేసిన సభ్యులు
- సాదా సీదాగా ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు చెప్పకుండా ప్రభుత్వ పథకాలు ఎలా అమలు చేస్తారని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. గత సర్వసభ్య సమావేశాల్లో తెలిపిన సమస్యలు చాలా వాటికి పరిష్కారం జరగలేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వెలుగు సంఘాల్లో నిరక్ష రాస్యులను అక్ష రాస్యులను చేసేందుకు ప్రభుత్వం ఉల్లాస్ పథకాన్ని ప్రవేశ పెట్టి వాలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చేపట్టిన సమాచారం ప్రజా ప్రతినిధులకు తెలియజేయకుండానే ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారని ఇది ఎంతవరకు సమంజసమని రొంపల్లి ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు నిలదీశారు. విద్యుత్ శాఖాధికారులు ఇదే మాదిరిగా లెక్కలేని తనంతో వ్యవహరిస్తున్నారని గ్రీన్ ఫీల్డ్ రహదారికి వెళ్ళే క్రమంలో బూసాయవలస గ్రామంలో విద్యుత్ స్తంబాలు రోడ్డు పక్కనే ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని రోడ్డుకి దూరంగా మార్పు చేయాలని కోరుతున్నా పట్టించు కోవడం లేదని మరో ఎంపిటిసి మడక తిరుపతినాయుడు నిలదీశారు. పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. పి4, ఇంటి పన్నులు వసూళ్ళకు సహకరించాలని ఎంపిడిఒ రత్నం కోరారు. నిరుపేదలకు పారదర్శకంగా ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని అర్హులైన వారు దరఖాస్తు చేయాలని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు అమలు చేస్తున్న క్రాష్ ప్రోగ్రామ్‌ను వినియోగించుకోవాలని గ్రామీణ నీటి పారుదల శాఖాధికారి వివరించారు. రాబోయే వేసవిలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వైద్యాధి కారులు దిలీప్ కుమార్, శిరీష తెలిపారు. మొత్తం మీద అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ ఏకమైన చందంగా సభ సాదాసీదాగా ముగిసింది.


అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

నేటి నుంచి కోటమ్మ పండగ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొట్టం కోటమ్మ అమ్మవారి పండగను సోమవారం నుండి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన దేవర ఉత్సవం ద్వారా వనం గుడిలో ఉన్న అమ్మవారిని గ్రామంలో గల గద్దె గుడిలో కొలువు దీరారని నేడు తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ పెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో గ్రామంలో విద్యుత్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని బుధవారం అనుపోత్సవానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో మంచినీళ్లు, పులిహోర, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తామని వెల్లడించారు.

గద్దె గుడిలో కోటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

గ్రామంలోని గద్దె గుడిలో కొలువైన కోటమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.శ్రీనివాస్ ఆమెకు సాలువ కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి వెంకన్న, ఇందుకూరి శ్రీనురాజు, జుత్తాడ రామసత్యం పాల్గొన్నారు.


వాహనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ఉపాధి కల్పనకు సహకారం అందించాలి

- ఎమ్మెల్యే మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు
- ఘనంగా ముగిసిన హీరో సర్వీస్ కమ్ సేల్స్ కార్నివాల్

ప్రజాశక్తి -పూసపాటిరేగ

ఉపాధి కల్పన, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సంస్థలు సహకారం అందించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. హీరో మోటో కార్ప్, శ్రీలక్ష్మి హీరో షోరూమ్ సంయుక్త ఆధ్వర్యంలో పూసపాటిరేగలో గత మూడురోజుల పాటు నిర్వహించిన సర్వీస్ కమ్ సేల్స్ మెగా కార్నివాల్ ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు కస్టమర్లకు కొత్త వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా హీరో సంస్థ వాహనాలను రూపొందించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా బి-6 వాహనాలు తయారు చెయ్యడం హర్షణీయమన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలోనూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకురావాలని కోరారు. ద్విచక్ర వాహనాల నిర్వహణ, రిపేర్ రంగంలో యువతకు శిక్షణ అందించాలని శ్రీలక్ష్మి షోరూమ్ అధినేత చిన్నబాబుకు సూచించారు. స్పందించిన చిన్నబాబు త్వరలోనే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సదరు శిక్షణ తీసుకునే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శ్రీలక్ష్మి హీరో షోరూమ్ అధినేత కందికుప్ప చిన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హీరో మోటో కార్ప్ సేల్స్ విభాగం ఏరియా మేనేజర్ మహీంద్రన్, ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ ప్రతినిధి డాక్టర్ రమేష్, పూసపాటిరేగ మాజీ ఎంపిపి మహంతి చిన్నం నాయుడు, పూసపాటి పాలెం సర్పంచ్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.